సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం । 1 । ఆగస్టు । 2023



జల్సాల కోసం దొంగలయ్యారు!

జల్సాలకు డబ్బు లేకపోవడంతో బైక్‌లను చోరీ చేసే వృత్తిని ఎంచుకున్న ముఠాను అన్నమయ్య బి.కొత్తకోట మండలం కాండ్లమడుగులో పోలీసులు అరెస్టు చేశారు. -8లో



టమాటా పంట ధ్వంసం

దేశవ్యాప్తంగా టమాటా ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో.. ఓ రైతు పండించిన పంటను దుండగులు నాశనం చేసిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో జరిగింది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1580	రూ.1840
రెండోరకం	రూ.1200	రూ.1560



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 321 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)



రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	501	511
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 221.64 కిలోలు

న్యూస్‌రీల్

రామయ్య హుండీ ఆదాయం రూ. 7,31,803

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయంలో జూన్–జూలై నెలకు సంబంధించి రూ. 7,31,803 ఆదాయం వచ్చిందని ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనుంజయులు తెలిపారు. సోమవారం టీటీడీ అధికారుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కించినట్లు చెప్పారు.

తిరుత్తణికి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: ఆడికృత్తికనుపురస్కరించుకుని ఈనెల 8,9 తేదీల్లో తిరుత్తణికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. ఉదయం 5.30, 6.30 గంటలకు ఎక్స్‌ప్రెస్‌లు నడుపుతామన్నారు.రాను,పోను రూ.500 చెల్లించాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 9959225677 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నేడు ట్రైసైకిళ్ల పంపిణీ

రాయచోటి: రాయచోటి నియోజకవర్గంలోని దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిళ్లు, మోటార్ వాహనాలు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్లను మంగళవారం పంపిణీ చేస్తున్నట్లు అన్నమయ్య జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి పి. రాజశేఖర్ రెడ్డి తెలిపారు. విభిన్న ప్రతిభావంతులశాఖ, తమ సొసైటీల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డిలు హాజరవుతారన్నారు. వినికిడి సరిగాలేనివారు, వికలాంగులై పూర్తిగా నడవలేనివారెవరైనా ఉంటే వారి ఆధార్, రేషన్ కార్డులతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, డాక్టర్ సర్టిఫికెట్, సంబంధిత ధృవీకరణ పత్రాలను తీసుకు రావాలన్నారు.

'ఉపాధి'లో రూ.165 కోట్ల వ్యయం

బి.కొత్తకోట: ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు రూ.165 కోట్లు కూలీసొమ్ముగా చెల్లించినట్లు డ్వామా పీడీ మద్దిలేటి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ గత ఏడాది కంటే ప్రస్తుత ఏడాది కూలీలకు అత్యధిక పనిదినాలు కల్పించామన్నారు. గత ఏడాది జూలై నాటికి 55 లక్షల పనిదినాలు కల్పించగా ఈ ఏడాది జూలై నాటికి 65.81 లక్షల పనిదినాలు కల్పించామని చెప్పారు. కాగా, జిల్లాలో కూలీలకు కల్పించాల్సిన 84 లక్షల పనిదినాల్లో 18 లక్షల పనిదినాలు మిగిలి ఉన్నాయని చెప్పారు. ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితులు ఉన్న కారణంగా ఉపాధి పనులకు డిమాండ్ ఎక్కువగా ఉంటుందని, దీనికి అనుగుణంగా ప్రణాళికలను సిద్ధం చేస్తామని మద్దిలేటి చెప్పారు.

రేపు ప్రెస్ అకాడమీ చైర్మన్ రాక

రాయచోటిటౌన్ : రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివారావు బుధవారం అన్నమయ్య జిల్లాలో పర్యటిస్తారని సమాచార శాఖ అధికారులు తెలపారు. మధ్యాహ్నం 2 గంటలకు మదనపల్లె గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారని తెలిపారు. గురువారం ఉదయం మదనపల్లె నుంచి కుప్పంకు వెళతారన్నారు. కుప్పం గెస్ట్ హౌస్‌లో మీడియా సమావేశం నిర్వహించి రాత్రి అక్కడే బస చేస్తారని తెలిపారు.

ఇసుక అక్రమరవాణాపై నిఘా ఉంచాలి

సిద్దవటం: ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఉంచాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. సోమ వారం సిద్దవటంలోని ఎస్‌ఈబీ పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మట్కా, పేకాట జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి స్మగ్లింపై నిఘా పెట్టాలన్నారు కార్యక్రమంలో ఎస్‌ఈబీ సీఐ ఉరుకుందమ్మ, పోలీసులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు

రాయచోటి: విద్యార్థుల అభ్యసన మదింపు సామర్థ్యాలను అంచనా వేసేందుకు విద్యాశాఖ ఏటా పరీక్షలు నిర్వహించడం పరిపాటి. గుణాత్మక విద్యను అందించేందుకు నిర్వహిస్తున్న ఫార్మేటివ్.. సమ్మేటివ్ పరీక్షలను ప్రభుత్వం గత ఏడాది నుంచి ప్రయోగాత్మకంగా క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్(సీబీఏ) పేరుతో నిర్వహిస్తోంది. ఈ క్రమంలోనే ప్రస్తుత విద్యా సంవత్సరం 4 ఫార్మేటివ్, 2 సమ్మేటివ్ పరీక్షల నిర్వహణకు జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) ఏర్పాట్లు చేస్తోంది. గత ఏడాది మాదిరిగానే 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు సీబీఏ, 9, 10వ తరగతుల వారికి ఫార్మేటివ్.. సీబీఏ విధానంలో నిర్వహించే పరీక్షలు ఆగస్టు 1 నుంచి 5వ తేదీ వరకు జరగనున్నాయి. ఎయిడెడ్ ప్రభుత్వ జెడ్పీ యాజమాన్యాల్లో 1,47,341 మంది, ప్రైవేట్ యాజమాన్యంలో 1,03,403 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. 1 నుంచి 8వ తరగతుల వరకు 2,00,440 మంది రాస్తున్నారు. పాత విధానంలో 9, 10వ తరగతులకు చెందిన 50,304 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరామ్ పురుషోత్తం తెలిపారు.

టమాట.. ఊరట



బహిరంగ మార్కెట్లో టమాటా ధరలు వినియోగదారున్ని బెంబేలెత్తిస్తున్నప్పటికీ... రాష్ట్రంలో ప్రజలపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. టమాటా ధరలు ఆకాశాన్ని అంటుతున్న తరుణంలో మార్కెటింగ్ శాఖ అధికారులను అప్రమత్తం చేసి మదనపల్లె, గుర్రంకొండ మార్కెట్లలో బహిరంగ వేలంలో రైతుల నుంచి టమాటాలను కొనుగోలు చేసి రైతు బజార్లకు తరలిస్తోంది. కేజీ టమాట ధర దాదాపు రూ.150 ఉండగా శనివారం నుంచి రూ.190 వరకు పలుకుతోంది. అయితే ప్రభుత్వం రైతు బజార్లో మాత్రం రాయితీ ధరపై కిలో రూ. 50కే అందజేస్తోంది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- వినియోగదారుడిపై భారం పడకుండా ప్రభుత్వం చర్యలు
- రాయితీపై కిలో రూ.50తో అందజేత
- 21 రైతు బజార్లలో నెల రోజులుగా సాగుతున్న విక్రయాలు
- ఆంధ్రా అంతటా..అన్నమయ్య టమాట



రాయచోటిలోని రైతు బజార్లో రూ.50లతో అందిస్తున్న టమాటాలను తీసుకెళ్లేందుకు క్యూలైన్లలో ఉన్న ప్రజలు

రాయచోటి: రెండు నెలలుగా టమాట ధర తగ్గేదేలా అంటోంది. దీంతో సామాన్య ప్రజలు వీటి వైపు చూసేందుకు కూడా భయపడుతున్నారు. మరి కొంత మంది మాత్రం కేజీ తీసుకునే దగ్గర పావుకేజీ తీసుకుని వెళ్తున్నారు. ఈ తరుణంలో ఏపీ సర్కార్ మార్కెట్లలో సబ్సిడీ రూపంలో టమాటాలు అందిస్తోంది. దీంతో తెల్లవారుజాము నుంచే రైతు బజార్ల వద్ద క్యూ కడుతున్నారు. ఆధార్ కార్డు తీసుకొస్తే ఒక్కొక్కరికి కిలో మాత్రమే రాయితీపై ఇస్తున్నారు.

రూ.324 కోట్లతో 3,04,460 కిలోల కొనుగోలు

మార్కెట్లో పెరిగిన ధరల నుంచి ప్రజలకు ఉపశమనం లభించే విధంగా ప్రభుత్వం రాయితీతో రూ.50లకు అందజేస్తోంది. గత నెల నుంచి ఇప్పటి వరకు రూ.3,23,26,734 కోట్లతో 3,04,460 కిలోల టమాటాలను కొనుగోలు చేసింది. వీటిని విశాఖపట్నం, విజయవాడ, కర్నూల్, కడప, తిరుపతి, గుంటూరు, కాకినాడ, ప్రకాశం, నెల్లూరు, చిలకలూరిపేట, రాయచోటి లాంటి రైతు బజార్లలో ఉన్న 21 ప్రాంతాల్లో ప్రజలకు కిలో రూ.50లతో విక్రయించారు. ప్రభుత్వం అన్నమయ్య జిల్లా మదనపల్లి, గుర్రంకొండ మార్కెట్ల నుంచి రాష్ట్రంలోని నలుమూలలకు ఖరీదైన టమాటాలను తరలించి ప్రజలకు అందిస్తోంది.

అదనపు భారాన్ని సైతం భరిస్తూ..

రైతుల నుంచి కిలో రూ.96 నుంచి రూ.190 వరకు కొనుగోలు చేసి ప్రజలకు మాత్రం ప్రభుత్వం రూ.50లకే విక్రయిస్తుంది. దీనివల్ల వంద రూపాయల నుంచి రూ.140 వరకు కొనుగోలు భారం భరించాల్సి వస్తోంది. ఈ భారంతో పాటు కొనుగోలు చేసిన కాయలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న రైతుబజార్లకు తరలించేందుకు రవాణా ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తోంది. తొలుత కిలో రూ.95 పలికిన టమాటా నేడు రైతుల వద్దనే రూ.190 పలుకుతోంది. ఇప్పటికే రైతులకు అందజేసే ధర.. రైతు బజార్లలో రూ.50తో అందజేస్తున్న ధరలు పోనూ ఒక కోటి 52 లక్షల 23 వేల రూపాయలు ప్రభుత్వం భరించింది. ఆయా ప్రాంతాలకు వాహనాల ద్వారా తరలించిన ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. దీంతో అదనంగా మరో పాతిక కోటి లక్షలపైన ఖర్చులు వచ్చే అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు.

ధరలతో సంబంధం లేకుండా టామాటాలు అందిస్తున్నాం

ధరలతో సంబంధం లేకుండా టమాటాలను కొనుగోలు చేసి ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతు బజార్లకు తరలిస్తున్నాం. గత నెల ప్రారంభంలో కిలో టమాటాలను రూ.69.50పై. కొనుగోలు చేశాం. రాను రాను ధరలు తగ్గకపోగా దేశవ్యాప్తంగా నెలకొన్న కొరతతో ప్రస్తుతం మదనపల్లి మార్కెట్లో కిలో రూ.200కు దగ్గరైంది. నెలన్నర రోజులుగా ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతు బజార్లకు తరలించి సామాన్య, పేద వర్గాల ప్రజలకు కుటుంబానికి కిలో వంతున అందజేస్తున్నాం.
– త్యాగరాజు, జిల్లా మార్కెటింగ్ శాఖాధికారి

రైతులు, సామాన్యుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కష్టించి పండించిన పంటకు మార్కెట్లో లభిస్తున్న ధరలను రైతులకు చెల్లించి పేద, సామాన్య ప్రజలకు అవసరమైన టమాటాలను రూ.50కి అందించాలని జగనన్న ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుంది. రాష్ట్ర ప్రజల కోసం ఎంత ఖర్చుకైనా ముఖ్యమంత్రి వెనకాడని మరో మారు రుజువైంది. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అందించని విధంగా రైతుబజార్లలో టమాటాలను నిల్వ ఉంచి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రజలకు అందిస్తోంది.
– పంజం సుకుమార్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్

ప్రభుత్వ నిర్ణయం సాహసోపేతం



టమాటా అవసరానికి తగ్గ దిగుబడి లేక ధరలు అమాంతంగా పెరిగిపోయి సామాన్య ప్రజలు కొనలేని పరిస్థితిలో ఉన్న సమయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సాహసోపేతమైనది. కిలో రూ.190లకు చేరినా ప్రజలకు మాత్రం రూ.50లకే అందిస్తోంది. రాయచోటిలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, అధికారుల సహకారంతో ఎక్కువ టమాటాలను తెచ్చి ప్రజలకు అందిస్తున్నాం.దీంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
– వండాడి వెంకటేశ్వర్లు, మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్మన్, రాయచోటి

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు: కలెక్టర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ప్రక్కన జేసీ

రాయచోటి: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం–స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ తోపాటు జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణలు ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. జిల్లాలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో అందిన సర్వీస్ రిక్వెస్ట్‌లకు టోకెన్ జనరేట్ చేసి వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు.

- జిల్లాలో ఓటర్ల జాబితా తయారీకి సంబంధించిన పరిశీలన కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో ఓటరు జాబితాపై జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జిల్లా ఎస్పీ గంగాధర్ రావుతో కలిసి అధికారులతో రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింట సర్వే నిర్వహించి పోలింగ్ కేంద్రాల వారీగా ఉన్న ఇళ్లసంఖ్య, సర్వేచేసిన ఇళ్లు, కొత్తగా నమోదు చేయాల్సిన ఓటర్లు, శాశ్వతంగా తొలగించిన ఓటర్లు, నకిలీ ఓట్లు, ఓటరుకార్డులో సవరణలు మొదలైన అంశాలపై నివేదికలను సమర్పించాలన్నారు. ప్రతి మండలంలో పోలింగ్ కేంద్రాల వివరాలను సమర్పించాలన్నారు. పోలింగ్ కేంద్రాల వారిగా ఓటర్లను మ్యాపింగ్ చేయాలని, సెల్‌ఫోన్ సిగ్నల్ రాని పోలింగ్ కేంద్రాల వివరాలు సమర్పించాలన్నారు.

భావితరాలకు బాసటగా గ్రామ సచివాలయాలు

- సువర్ణ పాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని

పులివెందుల/రూరల్: గ్రామ సచివాలయాలు భావితరలకు బాసటగా నిలుస్తున్నాయని, సువర్ణ పాలన అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని, 30 ఏళ్లు జగన్ సీఎంగా ఉంటే ఆంధ్రప్రదేశ్ నంబర్‌వన్‌గా ఉంటుందని ఏపీ ప్రెస్ అకాడమీ రాష్ట్ర చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం వైఎస్సార్ జిల్లా పులివెందులలోని ఎస్ఎంబీ కల్యాణ మండపంలో పులివెందుల నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 16వేల కోట్ల రూపాయలు నాడు – నేడు కింద ఖర్చు పెట్టి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. టెన్త్, ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదివిన వారే ఎక్కువ శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు, ఎల్లో మీడియాతో కలిసి అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రాన్ని శాంతి భద్రతలు లేకుండా చేసేందుకు చంద్రబాబు, పవన్ పన్నాగాలు పన్నుతున్నారన్నారు. వారు ఎన్ని పన్నాగాలు పన్నినా రాష్ట్ర ప్రజలు వారిని నమ్మే స్థితిలో లేరన్నారు. 90శాతం హామీలు అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. 2లక్షల కోట్ల రుణాలను ప్రజలకు అందించారన్నారు. అభివృద్ధి అంటే ఏమిటో చూడాలంటే కొప్పర్తి, విశాఖ, పులివెందుల తదితర ప్రాంతాలకు వెళ్లాలని చెప్పారు. రాబోయే ఎన్నికలలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా 175కు 175స్థానాలు, 25లోక్‌సభ స్థానాలు భారీ మెజార్టీతో గెలవడం జరుగుతుందన్నారు.

అభివృద్ధి అంటే వైఎస్.. వైఎస్ అంటే అభివృద్ధి

అభివృద్ధి అంటే వైఎస్.. వైఎస్ అంటే అభివృద్ధి అని కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు.టీడీపీ అధినేత, చంద్రబాబుకు పులివెందుల ప్రాంతంలో అడుగు పెట్టే అర్హత లేదన్నారు. సోమవార ఆయన పులివెందులలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి చేసిన పలు ప్రాంతాలను మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తో కలిసి పర్యటించారు.

వైఎస్సార్‌కు ఘన నివాళులు

వేంపల్లె: ప్రెస్ అకాడమీ రాష్ట్ర చైర్మన్ సోమవారం వేంపల్లె మండలంలోని ఇడుపులపాయను సందర్శించారు. వైఎస్సార్ సమాధి వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు.

టీడీపీలో ప్రకంపనలు

- జై జగన్ నినాదం
- దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించిన నాయకులు
- అధినేతను బూతులు తిట్టిన వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్



జై జగన్ నినాదాలుచేస్తున్న శ్రీరామవిద్యాసాగర్

మదనపల్లె : 'టీడీపీ కార్యాలయంలో జై జగన్ నినాదాలు' శీర్షికతో 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన వార్త అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గం టీడీపీ క్యాడర్‌లో ప్రకంపనలు సృష్టించింది. అందరూ ఈ విషయంపై విస్తృతంగా చర్చిస్తున్నారు. మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేష్ వర్గం నాయకులు..ఇది ఏడాదిక్రితం వీడియో అని, రాజకీయంగా తమ నాయకుడి ప్రతిష్టను దిగజార్చేందుకే తమ పార్టీలోని ప్రత్యర్థులు సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారని ఆరోపిస్తుంటే.. వైరి వర్గం నాయకులు మాత్రం సాక్షాత్తు ఇన్‌చార్జ్ దొమ్మలపాటి రమేష్ ప్రధాన అనుచరులు ఆయన కార్యాలయంలోనే పార్టీ అధినేత చంద్రబాబును బూతులు తిట్టడమేంటని.... అదీకాక ఉదయం లేచినప్పటి నుంచీ సాయంత్రం వరకు సీఎం జగన్‌ను విమర్శించాల్సిన చోట.. జై జగన్ అంటూ నినాదాలు చేయడమేంటని, వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రతి ఒక్కరి సానుభూతి పొందే ప్రయత్నం చేస్తున్నారు. సాక్షి పత్రిక, టీవీతో పాటు సామాజిక మాధ్యమాల్లో చంద్రబాబును బూతులు తిట్టిన వీడియో వైరల్ కావడంతో సోమవారం టీడీపీ నాయకులు దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. రాజంపేట క్రిస్టియన్ సెల్ పార్లమెంటరీ అధ్యక్షుడు దేవా రమేష్ వైరల్ అయిన వీడియోపై స్పందిస్తూ...టీడీపీ ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేష్ కార్యాలయంలో శ్రీరామ విద్యాసాగర్, రాటకొండ మధుబాబు, తాను ముగ్గురూ కూర్చుని మాట్లాడుకుంటున్న సమయంలో వీడియోను రికార్డ్ చేసింది తానేనని చెప్పుకొచ్చారు. టీడీపీ నాయకుడు శ్రీరామవిద్యాసాగర్ పార్టీకి వ్యతిరేకంగా మాట్లాడటమే కాకుండా రికార్డ్ చేసుకోరా అంటూ చెప్పడంతోనే తీసినట్లు వివరణ ఇచ్చారు. చిత్తూరుజిల్లాలోని కాణిపాకవినాయకస్వామి, తాను నమ్మే ఏసుప్రభువు సాక్షిగా తాను చెప్పేది అక్షరసత్యమన్నారు. శ్రీరామవిద్యాసాగర్‌ను రాటకొండ మధుబాబు రెచ్చగొట్టాడన్నారు. అంగళ్లలో కిషోర్, మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్‌పై జరిగిన దాడిపై మాట్లాడుతుండగా, యాలగిరి దొరస్వామినాయుడు, చినబాబులకు కారు అద్దాలు పగిలాయని హైకమాండ్ పదవులిచ్చిందని.. మరి నాకు తలకాయ పగిలింది, నాకు ఏమి ఇవ్వాలని రెచ్చగొట్టడంతో, అప్పటికే కొద్దిగా మద్యం మత్తులో ఉన్న విద్యాసాగర్ మాటలు తూలాడాన్నారు. దీనికి, టీడీపీ ఇన్‌చార్జి దొమ్మలపాటి రమేష్‌కు ఏమి సంబంధమని ప్రశ్నించారు. ఆరోజు తాను తీసిన వీడియో ఒక మధుబాబుకు తప్ప వేరెవ్వరికీ ఇవ్వలేదని, అప్పుడే డిలీట్ చేశానని, అధిష్టానం వరకు వీడియో వెళ్లిందని, అందరు పెద్దలు చూశారని చెప్పారు. విద్యాసాగర్‌కు పదవి రాలేదన్నారు. పార్టీకి ఎవరు ఏమి చేసినా ద్రోహమేనని, పెద్దాయన మీద ఎవరు మాట్లాడినా తప్పే..ఎవరైనా సరే.. ఆరోజు వీడియో వైరల్ చేశారు. సరిపోయింది. మళ్లీ నేడు వీడియో వైరల్ అయిందంటే.. రాటకొండ మధుబాబుకు మదనపల్లె ఎమ్మెల్యే టికెట్ అవసరం వచ్చింది కనుకే బయటకు వచ్చిందన్నారు. మధుబాబు రామసముద్రం కాంగ్రెస్ మీటింగ్‌లో తమ నాయకుడు చంద్రబాబునాయుడును అనరాని మాటలు అన్నాడని, చిత్తూరుబస్టాండ్‌లో దిష్టిబొమ్మలు తగులబెట్టాడన్నారు. కౌన్సిలర్ కాలేని వ్యక్తి తన స్వార్థం కోసం నియోజకవర్గంలో పార్టీకి సంబంధించిన ప్రతి కార్యక్రమంలో తప్పుడు ప్రచారాలు చేస్తున్నాడన్నారు. పసుపుచొక్కాలు వేసుకున్న వారందరూ నిజమైన తెలుగుదేశం కార్యకర్తలు కాలేరని, తన స్వార్థం కోసం వీడియో వైరల్ చేశాడన్నారు. అధిష్టానానికి తన విన్నపమేంటంటే.. ఇలాంటి వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని, ఒకవేళ తాను వీడియో తీసినది తప్పనిపిస్తే తనను సస్పెండ్ చేసినా అభ్యంతరం లేదని, ఈ ఒక్కసారికి తప్పుచేసిన వ్యక్తులపై విచారణ కమిటీ వేసి,వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సిందిగా వేడుకుంటున్నానన్నారు. ఈ విషయమై రాటకొండమధుబాబు వివరణ ఇస్తూ.. ఆరోజు ఘటనకు వీడియో సజీవ సాక్ష్యంగా ఉన్నందున తాను చెప్పాల్సిందేమీ లేదన్నారు. ఎన్నికలకు ఏడాది ముందుగానే టీడీపీలో నాయకుల మధ్య మొదలైన వర్గవిభేదాలు పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నాయని టీడీపీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు 4న మాజీ సీఎం చంద్రబాబు మదనపల్లె పర్యటన ఉంటుందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయన్నే బూతులు తిడుతూ స్థానిక నాయకులు చేసిన వీడియో నియోజకవర్గ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

సేవలకు సర్టిఫికెట్



- పెద్దమండ్యం పీహెచ్‌సీకి జాతీయ గుర్తింపు
- కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రశంసలు



పెద్దమండ్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

పెద్దమండ్యం: అన్నమయ్య జిల్లాలోని పెద్దమండ్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎన్‌క్యూఏఎస్(నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ స్టాండర్డ్స్) సర్టిఫికెట్ లభించింది. రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న ప్రజారోగ్య సౌకర్యాలను కేంద్రం ప్రశంసించింది. ఈ మేరకు రాష్ట్రంలో నాలుగు పీహెచ్‌సీలకు ఎన్‌క్యూఏఎస్ గుర్తింపు ఇస్తూ కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి విశాల్ చౌహాన్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటి క్రిష్ణబాబుకు రాసి లేఖలో అభినందనలు తెలిపారు. జూన్‌లో కేంద్ర బృందం గ్రామీణ ప్రాంతాలలోని పీహెచ్‌సీలలో ఏపీ ప్రభుత్వం కల్పిస్తున్న ప్రజారోగ్య సౌకర్యాల్లో నాణ్యతా ప్రమాణాలను స్వయంగా పరిశీలించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయిలో సంతృప్తికరమైన వైద్యసదుపాయాలు, సేవలందిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటించడంతో ఈ గుర్తింపు లభించింది.


ఆధునీకీకరణతో పీహెచ్‌సీకి కొత్తకళ

పెద్దమండ్యం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఆధునికీకరించింది. ప్రజారోగ్యానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పీహెచ్‌సీలలో నాణ్యతా ప్రమాణాలు మెరుగు పరిచి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంకల్పించారు. ఈ క్రమంలో పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్ల నియామకంతో సిబ్బంది కొరత లేకుండా పోయింది. జూన్ 21, 22 తేదీలలో పెద్దమండ్యం పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్యసేవలు, నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన బృందం కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖకు నివేదించింది.

పీహెచ్‌సీలో రోజువారీగా 80 మంది రోగులు


స్థానిక పీహెచ్‌సీకి రోజువారీగా 70 నుంచి 80 మంది రోగులు చికిత్స కోసం వస్తుంటారు. ఇక్కడ ఇద్దరు డాక్టర్‌లు ఉండగా, ఒకరు పీహెచ్‌సీలో 24 గంటల పాటు అందుబాటులో ఉంటారు. మరొక డాక్టర్ 104 ద్వారా ఎంపిక చేసిన గ్రామాలలో రోగులకు మధ్యా హ్నాం వరకు వైద్యసేవలను అందిస్తారు. మధ్యా హ్నాం నుండి అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చికిత్సలు నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా మండలంలోని 11 గ్రామ సచివాలయాలు ఉండగా, పెద్దమండ్యం గ్రామ సచివాలయం మినహా 10 సచివాలయాలలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. నెలలో సగటున ఐదు డెలివరీలు ఆసుపత్రిలో జరుగుతున్నాయి.

మెరుగైన వైద్యసేవలు



పీహెచ్‌సీలో రోజువారీగా వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. ప్రభుత్వం పీహెచ్‌సీకి వచ్చే రోగులకు అన్ని సౌకర్యాలను కల్పించింది. 24 గంటల పాటు పీహెచ్‌సీలో రోగులకు డాక్టర్ అందుబాటులో ఉంటారు. పీహెచ్‌సీలో సిబ్బంది కొరత లేకుండా ప్రభుత్వం నియమించింది. రోగులకు మెరుగైన సేవలను అందిస్తున్నాం. పీహెచ్‌సీకి నాణ్యతా ప్రమాణాల సర్టిఫికెట్ రావడం సంతోషంగా ఉంది. – క్రిష్ణయ్య, సీహెచ్‌వో, పెద్దమండ్యం

ప్రజారోగ్యానికే ప్రాధాన్యత



ప్రభుత్వం ప్రజారోగ్యానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోంది. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో ప్రజారోగ్యం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. పీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలను సిబ్బంది అందిస్తున్నారు. రాష్ట్రంలో నాణ్యత ప్రమాణాల సర్టిఫికెట్ పొందిన నాలుగు పీహెచ్‌సీలలో పెద్దమండ్యం ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది.
– జి పూర్ణచంద్రిక, ఎంపీపీ

ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న డీఈవో శ్రీరాం పురుషోత్తం

రాయచోటిటౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రను విజయవంతం చేయాలని డీఈవో శ్రీరాం పురుషోత్తం పేర్కొన్నారు. సోమవారం రాయచోటి డైట్ కేంద్రంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న 30 మండలాలకు చెందిన పీడీ/ పీఈటీలకు రాష్ట్ర స్థాయి క్రీడల నిర్వహణపై సూచనలు చేశారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి ప్రారంభమయ్యే క్రీడల్లో క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాడ్మింటన్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మదనపల్లె, రాయచోటి ఉప విద్యాశాఖాధికారులు కృష్ణప్ప, వరలక్ష్మి, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వసంత, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు రమేష్ బాబు, వీరాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు యువకులకు గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పట్టణంలోని అమ్మచెరువుమిట్ట జగన్‌కాలనీకి చెందిన షాహుల్‌హమీద్(17) ద్విచక్రవాహనంలో వ్యక్తిగత పనులపై పుంగనూరు రోడ్డులో వెళుతుండగా, ములకలదిన్నె వద్ద ఆటో ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా బాలాజీనగర్‌కు చెందిన సయ్యద్‌ఖాన్(25) ద్విచక్రవాహనంలో వస్తుండగా, జేసీఎం చర్చి ఎదురుగా పెట్రోల్‌బంకు సమీపంలో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో గాయపడగా స్థానికులు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

గొర్రెల వ్యాపారి రూ.54 లక్షలకు ఐపీ

మదనపల్లె : కలకడ మండలం ఎర్రకోటపల్లె పంచాయతీ గువ్వలవాండ్లపల్లెకు చెందిన సిద్ధారెడ్డి కుమారుడు కె.వెంకటరమణారెడ్డి కురబలకోట మండలం అంగళ్లులో గొర్రెల పెంపకంతో పాటు వ్యాపారం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో వ్యాపార అవసరాల నిమిత్తం మదనపల్లెకు చెందిన బి.రెడ్డిగోపాల్‌నాయుడు, బి.రెడ్డెప్పనాయుడు, రొంపిచెర్ల మండలానికి చెందిన కన్నయ్య, నెల్లూరుజిల్లా సైదాపురం మండలానికి చెందిన ఏ.వెంకటేశ్వర్లు వద్ద రూ.54.5 లక్షలు అప్పుచేశాడు. గొర్రెలకు నట్టలవ్యాధి సోకడంతో వ్యాపారంలో తీవ్రంగా నష్టం వచ్చి అప్పులు చెల్లించలేకపోయాడు. దీంతో మదనపల్లె కోర్టులో ఐపీ దాఖలు చేశాడు.

ఆర్టీసీ బస్సు ఢీకొని రైతుకు గాయాలు


గాయపడిన రైతు సుధాకరనాయుడు

మదనపల్లె : ఆర్టీసీ బస్సు ఢీకొని రైతు గాయపడిన సంఘటన సోమవారం కురబలకోట మండలంలో జరిగింది. తెట్టుపంచాయతీ దిగువపాళెం గ్రామానికి చెందిన రైతు సుధాకరనాయుడు (42) వ్యక్తిగత పనులపై ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు బయలుదేరాడు. అంగళ్లు బస్టాండ్‌లో కడప ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు ద్విచక్రవాహనాన్ని వెనుకవైపు నుంచి ఢీకొనడంతో అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో గాయపడిన బాధితున్ని స్థానికులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాల కోసం దొంగలయ్యారు!

- అంతర్‌జిల్లా బైక్ దొంగల ముఠా అరెస్ట్
- అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన రూ.31 లక్షల విలువైన 21 బైక్‌లు స్వాధీనం
- ఐదురోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు
- ఎస్‌ఐ, పోలీసులకు నగదు రివార్డులు అందించిన డీఎస్పీ కేశప్ప


పట్టుబడిన బైక్‌లు, నిందితులతో డీఎస్పీ, ఎస్‌ఐ

బి.కొత్తకోట : జల్సాలకు డబ్బు లేకపోవడంతో బైక్‌లను చోరీ చేసే వృత్తిని ఎంచుకున్న ముఠాను బి.కొత్తకోట మండలం కాండ్లమడుగులో పోలీసులు అరెస్టు చేశారు. మదనపల్లె డీఎస్పీ కె.కేశప్ప సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. గుర్రంకొండ మండలం దిగువతొట్లివారిపల్లెకు చెందిన చెన్నూరి ప్రకాష్ (25)కు తల్లిదండ్రులు లేరు. వివాహమైనా భార్య దూరమైంది. ఒంటరిగా ఉంటున్న ప్రకాష్ దురలవాట్ల వల్ల కూలిపనులు చేసుకుంటే వచ్చే డబ్బు సరిపోయేది కాదు. దీంతో డబ్బు కోసం బైక్‌లను చోరీ చేయడం ప్రారంభించాడు. తిరుపతిలో ఇతనికి రెండేళ్ల క్రితం కూలి పనులు చేసుకునే నెల్లూరు శెట్టిగుంటరోడ్‌కు చెందిన గణేశం సుబ్బారెడ్డి (31) పరిచయం అయ్యాడు. కూలి పనులకు వెళ్లడం వల్ల అవసరాలకు సరిపడా డబ్బు రావడం లేదని కలిసి బైక్ చోరీలకు పాల్పడేందుకు నిర్ణయించుకున్నారు. వీరు చోరీ చేసే ఖరీదైన బైక్‌లను చవక ధరకే విక్రయించి ఆ డబ్బుతో జల్సాలు చేసుకునేవారు. బైక్‌లను విక్రయించే సమయంలో కలకడకు చెందిన గుజిరి వ్యాపారి ఎం.అక్బర్ (19) పరిచయం అయ్యాడు. చోరీ చేసిన బైక్‌లను అక్బర్‌కు విక్రయించేవాళ్లు. ఇలా 2022 ఏప్రిల్ నుంచి బైక్‌ల చోరీని కొనసాగిస్తున్నారు. వీరిలో తిరుపతికి చెందిన ప్రకాష్‌పై అలిపిరి పోలీస్‌స్టేషన్‌లో నాలుగు బైక్ చోరీ కేసులు నమోదై ఉన్నాయి. సుబ్బారెడ్డి, అక్బర్‌లపై ఎలాంటి కేసులు నమోదుకాకపోవడంతో బైక్ చోరీలపై పోలీసులకు అంతుచిక్కలేదు. ఈ నేపథ్యంలో జూలై 15న హార్సిలీహిల్స్‌పై నిలిపి ఉంచిన రెడ్డెప్పనాయక్‌కు చెందిన బైక్ చోరీకి గురైంది. దీనిపై బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ రామమోహన్ కేసు దర్యాప్తు ప్రారంభించారు. హార్సిలీహిల్స్‌పై నుంచి బైక్‌ను తీసుకొచ్చే సమయంలో నిందితులు సీసీ కెమెరా కళ్ల నుంచి తప్పించుకోలేకపోయారు. సాంకేతిక ఆధారాలను వినియోగించి నిందితులను పట్టుకునేందుకు పోలీసులు ప్రయత్నాలు మొదలుపెట్టారు.

విక్రయించాలని వచ్చి..

బి.కొత్తకోట మండలం కాండ్లమడుగు క్రాస్ వద్ద ఉన్న ఓ గోదాము వెనుక దాచిపెట్టిన బైక్‌లను తీసుకెళ్లి విక్రయించాలని నిందితులు ప్రకాష్, సుబ్బారెడ్డి ప్రయత్నించారు. వీరి ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో ఎస్‌ఐ, సిబ్బంది దాడులు నిర్వహించి నిందితులను పట్టుకుని విచారించగా వ్యవహారం బయటబయటపడింది. ఈ ఇద్దరితోపాటు అక్బర్‌ను అరెస్ట్ చేశారు.

3 జిల్లాలు..21 బైక్‌లు..

అరెస్టయిన నిందితులు చోరీ చేసిన 21 బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో బి.కొత్తకోట, పాకాల, తిరుపతి నగరం, కల్లూరు, పుంగనూరు, గుర్రంకొండ మండలం కృష్ణాపురం, చిత్తూరు నగరం, తవణంపల్లె మండలం పుణ్యసముద్రం, కలకడ, పాకాల మండలం దామలచెరువు, పీలేరులకు చెందినవి ఉన్నాయి. వీటి విలువ రూ.31లక్షలుగా నిర్ధారించారు. నిందితులు ముగ్గురిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించామని డీఎస్పీ పేర్కొన్నారు.

ఎస్‌ఐ, పోలీసులకు రివార్డులు

హార్సిలీహిల్స్‌పై బైక్ చోరీకి గురైన కేసును ఛేదించడంతో పాటు మూడు జిల్లాల్లో బైక్ చోరీలు చేసిన ముఠాను కేవలం ఐదురోజుల్లో అరెస్ట్ చేసిన ఎస్‌ఐ కె.రామమోహన్, ఏఎస్‌ఐ బొజ్జే నాయక్, హెడ్‌కానిస్టేబుల్ రెడ్డెప్పనాయక్, 9మంది కానిస్టేబుళ్లు, ఒక హోంగార్డును డీఎస్పీ కేశప్ప అభినందించారు. వారికి నగదు రివార్డును అందజేశారు. స్వాతంత్ర్య వేడుకల్లో ఎస్‌ఐకు ప్రశంసాప్రతానికి ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు.

ఉదయం అదృశ్యం.. సాయంత్రం ప్రత్యక్షం

రాయచోటిటౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన మూడే మోహన్ నాయక్ కుమారుడు మూడే సోహిత్ సాయి నాయక్ సోమవారం ఉదయం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గాలింపు చేపట్టిన పోలీసుల ఎదుట సాయంత్రం ప్రత్యక్షమయ్యాడు. పోలీసుల కథనం మేరకు.. సోహిత్ సాయి నాయక్ ఉదయం ఏడు గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. తరువాత ఎంతకు ఇంటికి రాకపోవడంతో మధ్యాహ్నం తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఆ అబ్బాయి ఫొటోను సోషియల్ మీడియాలో పోస్టు పెట్టి వివరాలు వెల్లడించారు. అలాగే పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. కంచాలమ్మ గండి సమీపాన ఒంటరిగా ఉన్న విషయాన్ని గుర్తించి పట్టుకొని స్టేషన్‌కు తీసుకొచ్చారు. తల్లిదండ్రులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి నచ్చచెప్పి ఇంటికి పంపించామని అర్బన్ ఎస్‌ఐ నరసింహారెడ్డి తెలిపారు.

పశువుల కాపరికి పాము కాటు

కురబలకోట : మండలంలోని అంగళ్లు మల్లయ్యకొండ గోశాల పశువుల కాపరి ఎస్. అక్కులప్ప (65)ను ఆదివారం రాత్రి పాము కాటేసింది. పశువులను గాటిన కట్టేస్తుండగా ఈ సంఘటన జరిగింది. హుటాహుటిన ఆలయ చైర్మన్ కాకర్ల కృష్ణమూర్తి అతన్ని మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అత్యవసర విభాగం వైద్యులు మెరుగైన వైద్య సేవలు అందిచడంతో ఆయన కోలుకున్నారు.

సీమకు ద్రోహం చేసిన బీజేపీని రాజకీయంగా సమాధి చేద్దాం

కడప ఉక్కుకోసం కలెక్టరేట్ ఎదుట ధర్నాలో సీపీఎం నేతలు


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

రాయచోటి అర్బన్ : విభజన హామీల అమలులో రాయలసీమకు తీరని ద్రోహం చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని రాజకీయంగా సమాధి చేద్దామని సీపీఎం జిల్లా ప్రధానకార్యదర్శి పి.శ్రీనివాసులు పేర్కొన్నారు. ఉక్కుఫ్యాక్టరీ నిర్మాణంలో పాలకులు అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ ఆ పార్టీ కార్యకర్తలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక హోదాతో పాటు విభజన చట్టంలోని అన్ని అంశాలను అమలుపరుస్తామని కేంద్రంలోని బీజేపీ నాయకులు హామీలు గుప్పించారన్నారు. దశాబ్దం గడుస్తున్నా ఒక్కహామీ కూడా పూర్తి కాలేదన్నారు. ఇంతకాలం ఫ్యాక్టరీ ఏర్పాటుపై కల్లిబొల్లి కబుర్లు చెబుతూ వచ్చిన బీజేపీ పాలకులు ఉన్నట్లుండి స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా అధ్యయనం చేసి ఇచ్చిన నివేదిక ప్రకారం కడపలో స్టీల్ ఫ్యాక్టరీ ఏర్పాటు సాధ్యం కాదని ప్రకటించడం దారుణమన్నారు. ప్రభుత్వ రంగంలో లాభదాయకం కాని స్టీల్ ఫ్యాక్టరీ ప్రైవేట్ రంగంలో జిందాల్ కంపెనీకి ఎలా లాభదాయకం అవుతుందో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎ.రామాంజులు, రవికుమార్, వెంకట్రామయ్య, ప్రభాకర్‌రెడ్డి, నరసింహ, బసిరెడ్డి, జయరామయ్య, వెంకటేష్, సురేంద్ర, ఫయాజ్, మెహరాజ్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సాహస వలంటీర్‌కు నగదు పురస్కారం


వలంటీర్ సురేష్‌ను పుష్పగుచ్ఛం అందజేసి అభినందిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

రైల్వేకోడూరు : రైల్వేకోడూరు మండలం ఓ.కొత్తపల్లెలో శనివారం రాత్రి పీర్ల చావిడి వద్ద ఏర్పాటు చేసిన గుండంలో కల్లూరి బాషా అనే వ్యక్తి ప్రమాదవశాత్తు పడిపోగా వలంటీర్ చాపల సురేష్ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కాపాడిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు సోమవారం వలంటీర్ ఇంటికి వెళ్లి సన్మానించి నగదు పురస్కారం అందజేశారు. ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ ప్రజలకు ఎంతో మేలు చేస్తోందనేందుకు ఈ సంఘటన నిదర్శనమన్నారు. కాగా పీర్లగుండంలో పడి తీవ్రగాయాలైన బాషాకు మెరుగైన వైద్యం అందించాలని రుయా ఆసుపత్రిలోని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, ప్రముఖ న్యాయవాది ఆర్‌సీ సురేష్ బాబు, ఎంపీటీసీ జనార్దన్‌రాజు, ప్రతాప్‌రెడ్డి, సుంకేసుల బాషా, తొండం రాజేంద్ర, ధనుంజయ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మనస్పర్థలతో ఆత్మహత్యాయత్నం


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వలంటీర్ భవిత

మదనపల్లె : మహిళా గ్రామ వలంటీర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. కోటవారిపల్లె పంచాయతీ పాకాలవారిపల్లెకు చెందిన మణికంఠ భార్య భవిత(24) పెంచుపాడు పంచాయతీ కొండమీదపల్లె గ్రామ వలంటీర్‌గా పనిచేస్తోంది. భర్త అయిదేళ్ల క్రితం మృతి చెందాడు. సోమవారం కుటుంబ సమస్యల కారణంగా ఇంట్లోనే పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

ములకలచెరువు మండలం చీకటిమానుపల్లెకు చెందిన వెంకటేష్ కుమారుడు విజయ్(16) స్థానికంగా పదో తరగతి చదువుతున్నాడు. ఇటీవల సక్రమంగా పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. తనకు చదువుకోవడం ఇష్టం లేదని, తల్లిదండ్రుల ఎదుటే చెప్పడంతో వారు మరింత కోప్పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన విజయ్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అవుట్‌పోస్ట్ సిబ్బంది సమాచారాన్ని ములకలచెరువు పోలీసులకు అందించారు.

హైవే బైపాస్ అలైన్‌మెంట్ మార్చేశారు!

- హైకోర్టును ఆశ్రయించిన బాధితుడు
- పనులు నిలుపుదల చేయాలని ఆదేశం

కురబలకోట : కురబలకోట మండలం అంగళ్లు మీదుగా వెళ్లే హైవే బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్‌ను అనధికారికంగా మార్చడం వల్ల అన్యాయంగా భూములు కోల్పోవాల్సి వస్తోందని మదనపల్లె పట్టణానికి చెందిన కనసాని అర్జున్ రెడ్డి రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. దీంతో తాత్కాలికంగా పనులు నిలుపుదల చేయాలని కోర్టు ఆదేశించింది. సోమవారం అతనితోపాటు బాధిత రైతులు మదనపల్లె ఆర్డీఓ మురళి, స్థానిక తహసీల్దార్ ఎం.భీమేశ్వరరావుకు కూడా న్యాయం చేయాలని స్పందనలో ఫిర్యాదు చేశారు. వారి కథనం మేరకు..ములకలచెరువు నుంచి మదనపల్లె వరకు ఎన్‌హెచ్ 42 రోడ్డు విస్తరణ (ఫోర్‌లేన్) పనులు రూ. 480 కోట్లతో సాగుతున్నాయి. భూసేకరణకు 2021లో కేంద్ర రోడ్డు రవాణా రహదారుల మంత్రిత్వ శాఖ తొలి నోటిఫికేషన్ ఇచ్చింది. ఆ తర్వాత 2022లో మలి నోటిఫికేషన్ ఇచ్చారు. న్యూఢిల్లీ మోర్త్ వారు రోడ్డు మ్యాపుతో పాటు విధి విధానాలు రోడ్డు నిర్మాణం కోసం అధికారులు ప్రొసీడింగ్స్ ఇచ్చారు. వీటిలో అంగళ్లు గ్రామ కస్బా 1061, 1062, 1060, 1073 సర్వే నంబర్లలో ఒకటిన్నర ఎకరం పోతున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఆ తర్వాత అధికారులు ఎందుకో మాస్టర్ ప్లాన్, అలైన్‌మెంట్ మార్చారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అంగళ్లులో భూముల ధరలు ఎక్కువ పలుకుతున్నాయి. దీంతో బడా రైతులు తమ భూముల మీదుగా వెళ్లే హైవే బైపాస్ రోడ్డు ప్లాన్ మార్చి వాళ్ల భూములను కాపాడుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముందు నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారమే బైపాస్ రోడ్డు వేయాలని మరోసారి సర్వే నిర్వహించాలని వారు కోరుతున్నారు. ఈ విషయమై విచారణ జరుపుతామని ఆర్డీఓ తెలిపారు.

చెక్ బౌన్స్ కేసులో నిందితుడి పరార్

కలికిరి : చెక్‌బౌన్స్ కేసుకు సంబంధించి పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు పోలీసుల కన్నుగప్పి తప్పించుకుపోవడంతో జిల్లా ఎస్పీ గంగాధర రావు కలికిరి స్టేషన్‌కు సంబంధించిన హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలు... కలికిరి గ్రామ పంచాయతీ యర్రపల్లికి చెందిన ఓ నిందితునిపై కాకినాడలో చెక్‌బౌన్స్ కేసు నమోదైంది. నిందితుడు కోర్టుకు హాజరుకాకపోవడంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ఈ మేరకు అక్కడి పోలీసుల సమాచారంతో కలికిరి పోలీసులు వారం రోజుల క్రితం నిందితున్ని అదుపులోకి తీసుకుని హెడ్‌కానిస్టేబుల్ మహమ్మద్ రఫీ, కానిస్టేబుల్‌లు వెంకటసిద్దులు, సుబ్రమణ్యంలు కాకినాడకు తరలించారు. కాగా అక్కడ కోర్టులో హాజరుపరిచే సమయంలో నిందితుడు పోలీసుల నుంచి తప్పించుకున్నాడు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు కలికిరి ఎస్‌ఐ రహీముల్లాకు సమాచారమిచ్చారు. ఎట్టకేలకు నాలుగు రోజుల తరువాత నిందితున్ని తిరిగి అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచారు. అయితే ఈ సంఘటనను సీరియస్‌గా పరిగణించిన జిల్లా ఎస్పీ, నిందితుని ఎస్కార్ట్‌లో అలసత్వం వహించిన హెడ్‌కానిస్టేబుల్, ఇద్దరు కానిస్టేబుళ్లను విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళ బ్యాగులో బంగారు గొలుసు అపహరణ

బద్వేలు అర్బన్ : స్థానిక ఆర్టీసీ బస్టాండులో సోమవారం ఓ మహిళ బ్యాగులో బంగారు గొలుసు అపహరణకు గురైంది. వివరాల్లోకి వెళితే పోరుమామిళ్లకు చెందిన రహమత్‌బీ తన కుటుంబ సభ్యులతో కలిసి నెల్లూరు జిల్లాలో జరుగుతున్న రొట్టెల పండుగకు బయలుదేరింది. నెల్లూరులో ఉంటున్న ఆమె కుమార్తె తన బంగారు గొలుసు తీసుకురావాలని చెప్పడంతో రహమత్‌బీ తన బ్యాగులో బంగారు గొలుసు ఉంచుకుని పోరుమామిళ్ల నుంచి బద్వేలుకు వచ్చింది. బద్వేలులో నెల్లూరు బస్సు ఎక్కిన తర్వాత బ్యాగులో గొలుసు చూసుకోగా కనిపించలేదు. వెంటనే బస్టాండులోని సిబ్బందికి విషయం తెలపడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న పోలీసులు కొందరు అనుమానిత మహిళలను స్టేషన్‌కు తరలించి విచారించగా గొలుసు లభ్యం కాలేదు. దీనిపై పూర్తిస్థాయిలో విచారిస్తున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ - తప్పిన ప్రమాదం

వేంపల్లె : స్థానిక కడప రోడ్డులో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో మంటలు అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. కడప రోడ్డులోని సి.ఫకృద్దీన్ ఇంట్లో ఫ్రిడ్జ్ వద్ద షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఇంట్లోని వస్తువులన్నీ దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదమే తప్పింది. అగ్నిమాపక సిబ్బంది వెంకటసుబ్బయ్య, పెద్దయ్య, భీమాంజనేయులు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టమాట పంట ధ్వంసం


దుండగులు ధ్వంసంచేసిన టమాట పంటను చూపుతున్న బాధితరైతు కుటుంబ సభ్యులు

నిమ్మనపల్లె : దేశవ్యాప్తంగా టమాట ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో.. ఓ రైతు శ్రమకోర్చి పండించిన పంట చేతికందే సమయంలో కొందరు దుండగులు చేలోని పంటను పూర్తిగా నాశనం చేసిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో సోమవారం వేకువజామున జరిగింది. తవళం పంచాయతీ ఉంటావారిపల్లెకు చెందిన గంగిరెడ్డి కుమారుడు ఏ.ముత్యాలు గ్రామవలంటీర్‌గా పనిచేస్తూ వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఇటీవల వారి సొంత పొలంలో రూ.2లక్షలు ఖర్చుచేసి టమాటా పంటను సాగుచేశాడు. పంట కోతదశకు రాగా ఆదివారం మొదటిసారిగా తొలిసారి కాయలు కోశారు. 20 క్రేట్ల టమాటాలను మార్కెట్‌కు తరలించగా ఒకో క్రేట్ రూ.4,400 చొప్పున ధర పలికి పెద్దమొత్తంలో నగదు వచ్చింది. రాత్రి 11 గంటలవరకు పొలంవద్దే కాపలాగా ఉన్నాడు. తర్వాత ఇంటికి చేరుకోగా అర్ధరాత్రి దాటిన తర్వాత గుర్తు తెలియని దుండగులు టమాటా పంటను ధ్వంసం చేశారు. చెట్లను వేర్లతో సహా పెకిలించారు. ఉదయాన్నే పొలం వద్దకు వెళ్లి చూసిన ముత్యాలు వెంటనే తల్లిదండ్రులకు విషయం తెలిపాడు. తనకు జరిగిన అన్యాయంపై స్థానిక పోలీసులకు, ఉద్యానశాఖ అధికారులకు ఫిర్యాదుచేశాడు. పంట ధ్వంసం చేసిన కారణంగా తనకు రూ.10లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని వాపోయాడు.

మునగానపల్లెలో మాయమై బెంగళూరులో ప్రత్యక్షం


రవితేజ

బి.కొత్తకోట : బాగా చదువుకోమని తండ్రి చెబితే పాఠశాల నుంచి ఇంటికి రాకుండా అదృశ్యమైన విద్యార్థి సోమవారం కర్ణాటకలోని బెంగళూరు గాంధీనగర్ పోలీసులకు చిక్కాడు. ఈ విషయమై అక్కడి పోలీసులు బి.కొత్తకోట ఎస్‌ఐ రామమోహన్‌తో చర్చించారు. వివరాలు ఇలా.. పెద్దతిప్పసముద్రం మండలం సంపతికోటకు చెందిన విశ్వనాథరెడ్డి కుమారుడు రవితేజ (14) గ్రామానికి సమీపంలోని కర్ణాటకకు చెందిన మునగానపల్లె ప్రభుత్వ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. ప్రతిరోజూ హైస్కూల్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేవాడు. జూలై 12న బాగా చదువుకోవాలని కొడుకుకు తండ్రి సూచించాడు. ఆరోజు హైస్కూల్‌కు వెళ్లిన రవితేజ ఇంటికి తిరిగి రాలేదు. అదృశ్యమైన కొడుకు కోసం తండ్రి బట్లపల్లె పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం బెంగళూరు గాంధీనగర్ పరిసరాల్లో సంచరిస్తున్న రవితేజను పోలీసులు గుర్తించి వివరాలు ఆరా తీశారు. పోలీసుల విచారణలో తనది బి.కొత్తకోటగా చెప్పాడు. దీనితో స్థానిక ఎస్‌ఐను సంప్రదించిన గాంధీనగర్ పోలీసులు రవితేజ ఫొటో, వివరాలు పంపారు. ఈమేరకు సంపతికోటకు చెందిన విశ్వనాథరెడ్డి కుమారుడిగా గుర్తించి బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- టీడీపీ నుంచి 45 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక
- ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మంచూరు పంచాయతీ పాతమంచూరుకు చెందిన చింతపర్తి ఆదిరెడ్డి ఆధ్వర్యంలో 45 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో చంద్రశేఖర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, జనార్దన్ రెడ్డి, నారాయణ, క్రిష్ణయ్య, మస్తాన్, నరసింహులు, శ్రీనివాసులు, వెంకటరమణ, రామాంజులు, జి. వెంకట్రమణ, ఓబుల్ రెడ్డి, వేణుగోపాల్, రమణ, వెంకటస్వామి, హరి, క్రిష్ణయ్య, క్రిష్ణ, యల్లప్ప, శ్రీనాథ్, ధర్మ తదితరులు ఉన్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ప్రభుత్వానికి సంబంధించిన ఏ పని కావాలన్నా కార్యాలయాల చుట్టూ తిరగడంతో పాటు లంచాలు ఇచ్చుకునే పరిస్థితి ఉండేదని విమర్శించారు. నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ పరిస్థితిని పూర్తిగా మార్చివేశారన్నారు.